జిందగీ
చిత్రమే
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 16 డిసెంబర్ 2024
www.ntnews.com

గోపికల పిక గీతికలు

అరవిందాక్షుడు గోవిందుని స్వరూపానందాన్ని వైష్ణవ శాస్త్రాలలో 'ఆహ్లాదినీ శక్తి' అని అంటారు. ఈ శక్తి సార సర్వస్వమే ప్రేమ. ఈ ప్రేమ యొక్క పరమ ఫలమే భావం. ఈ భావ పరిపూర్ణతయే మహా భావం. ఈ మహాభావమే రాధాదేవి! ఆరాధనా స్వరూపురాలైన రాధను కూడా కాదని వదలి యాదవ శిరోరత్నం అబాధంగా– అడ్డులేక అంతర్ధానమవడానికి ప్రధాన కారణాలు రెండు అని వ్యాఖ్యానం.. రాధను వదలివేస్తే ఆమెను చూచిన యెడల భగవానుని వియోగ బాధను అనుభవిస్తున్న గోపికల ప్రాణాలు నిలుస్తాయి. రెండోది.. రామావతారంలో సతీ–సీతా వియోగంలో రాముడు రోదించాడు. ప్రతి (మారు)గా కృష్ణావతారంలో రాధ, గోపికలు విలపించారు. శుక ఉవాచ..

మ॥ 'అని యిబ్భంగి లతాంగులందరును బృందారణ్యమం దీశ్వరున్ వనజాక్షుం బరికించి కానక విభున్ వర్ణించుచుం బాడుచున్ మనముల్ మాటలు జేష్టలుం గ్రియలు నమ్మానాథుపై జేర్చి వే చని ర య్యామున సైకతాగ్రమునకున్ సంత్యక్త గేహేచ్ఛలై'

పరీక్షిన్మహారాజా! ఈ విధంగా ఆ గోప వనితలందరూ బృందావనంలో భగవంతుని, వనజాక్షుని– నందసూనుని ఎంత వెదికినా కనలేకపోయారు. ఆ ఘనశ్యాముని వైభవోపేతమైన గుణ గణాలను, లీలలను వర్ణించి పాడుతూ తమ మనోవాక్కాయ కర్మలను ఆ మా–లక్ష్మీ పతి కృష్ణుని మీదనే చేర్చి, ఇళ్లకు వెళ్లాలన్న ఇచ్ఛలు– కోరికలు కూడా వీడి, స్వచ్ఛమైన ఆ యమునా తీరంలోని ఇసుక తిన్నెల వద్దకు వచ్చారు. సిరి మగని– వెన్నుని (హరి) సాక్షాత్కారానికై పరితపిస్తూ గోప గరిత (వనిత)లు గీతములు పాడారు. గానంలో రోదనం, రోదనంలో గానం– అవే గోపీ హృదయ గీతికలు. ఇందు (చంద్ర)ముఖులు ఎందరున్నా అందరి ఆంతర్యం సమానమే కాన, అందరి గళమూ, గానమూ ఒక్కటయ్యాయి. పరమాత్మకు పన్నీరు కన్నా భక్తుల కన్నీరంటేనే మక్కువ ఎక్కువ. సంస్కృత భాగవతంలో ఈ గోపికా గీతికలు 'కనక మంజరి' అనే ఛందస్సులో కూర్చబడినాయి. కనక మనగా ధత్తూరం– ఉమ్మెత్త. ఉమ్మెత్తను తింటే ఉన్మాదం– మత్తు కలుగునట్లుగ ఈ ఛందస్సులో మాధవుని స్తుతిస్తే మనిషి మనసు ప్రపంచాసక్తిని వదలి, విరక్తి చెంది పరమాత్మ యందు నిశ్చలమై నిలిచిపోతుంది.

**క॥ 'నీవు జనించిన కతమున
నో వల్లభ! లక్ష్మి మంద నొప్పె యధికమై
నీ వెంటనె ప్రాణము లిడి
నీ వారరసెదరు చూపు నీ రూపంబున్'**

'బిసరుహ (కమల) నయనా! నీవసలు కేవలం యశోదా కుమారుడవే కావయ్యా. అఖిల దేహధారుల హృదయాలలో అంతర్యామిగా ఉన్న అంతరాత్మవు. బుద్ధికి సాక్షీభూతుడవు. లక్ష్మీనాథుడవు. పూర్వం విరించి– బ్రహ్మదేవుడు నిన్ను స్మరించి. విశ్వరక్షణ గావించమని ప్రార్థించగా భారాన్ని హరించి భూమండలాన్ని ఉద్ధరించడానికి నీవిలా సాటిలేని మనోహర రూపంతో మేటి యదు వంశంలో నందు పట్టివై పుట్టావు. సంసారానికి వెరచి శరణాగతులైన మునులకు, ముముక్షువులకు అభయమిచ్చే నీ హస్తాన్ని మా మస్తకాలపై ఉంచి మమ్ము బ్రతికించు. ఓ మాధవా! నీ పాదాలు సమస్త సౌందర్య మాధుర్య నిధులు. అవి మహాలక్ష్మికి నివాస స్థానాలు. ఆమెచే నిత్య పూజలందుకునేవి. అట్టి పాదాలపై పడ్డవారి పాపాలన్నీ పటాపంచలైపోతాయి. గోవులకు సులభమైన పాదాలు మాకు దుర్లభాలా? దురిత నివారకా! మేము ధేనువుల కన్నా దీనలమై ఈ కాననంలో నిన్ను వెదుకుతున్నాం. కాన, ఓ జలరుహ (కమలా)ననా! సాధనహీనలమైన మా హృదయాలపై నీ పాదాలు ఉంచి, వానిలోని కామ వాసనలను రామానుజా! తొలగించు. 'మీ హృదయాలలోని అహంకారమనే విష ప్రభావం నా పాదాలపై పడే ప్రమాదం ఉన్నది కదా!' అని అంటావేమో దామోదరా! కాళీయుని పడగలపై వదలకుండా నృత్యం చేసిన వాడవు కదా! మా ఎదలలోని విషం నిన్నేమి చేస్తుంది? నీ చరణాల అమృత స్పర్శతో మా విషపూరిత హృదయాలు అమృత మయాలవుతాయి. మధుసూదనా! నీ అధరామృతం జుర్రజేసి మా మదనతాపం తొలగించు.' వామనేత్రలైన గోపభామలు కామసుఖం కాదు, సంపూర్ణ కామ విరామం కోరుతున్నారన్నది విజ్ఞులకు విస్పష్టం.

**ఆ॥ 'విషజలంబు వలన విషధర దానవు
వలన రాల వాన వలన వహ్ని
వలన నున్న వాని వలనను రక్షించి
కుసుమ శరుని బారి గూల్ప దగునె?'**

పదిమంది వాడుకొనే కాళిందీ నదీ జలాలను విషం కక్కి కలుషితం చేసే కాళీయుని నుండి, అజగర– కొండచిలువ రూపుడైన అఘాసురుని నుంచి, కులిశి (ఇంద్రుడు) కురిపించిన రాళ్ల వాన నుండి, కాననం– అడవిలో చెలరేగిన కార్చిచ్చు నుండి, సుడిగాలి రక్కసి (తృణావర్తుడు) నుండి, ఇంకా ఇలాంటి ఎన్నో ఆపదల నుండి వడివడిగా మమ్ములను కాపాడావు. అంతమంది అసురులను అంతమొందించి మమ్ము రక్షించింది ఇప్పుడీ కంతు– మారు (మన్మథు)ని బారికి గురిచేయడానికా శ్రీకాంతా! ఇది న్యాయమా?

**ఉ॥ 'నీవు యశోద బిడ్డడవె? నీరజనేత్ర! సమస్త జంతు చే
తో విదితాత్మ! వీశుడవు తొల్లి విరించి దలంచి లోకర
క్షా విధమాచరింపు మని సన్నుతి సేయగ సత్కులంబునన్
భూ వలయంబుగావ నిటు పుట్టితి గాదె మనోహరాకృతిన్'**

భాగవత మహాపురాణం ఎల్లెడల (అంతటా) బాదరాయణుడు వ్యాసుడు ప్రయోగించింది 'సమాధి భాష' అన్నారు వల్లభాచార్యులు. ధరా అనగా భూమి. ధరామృతం భూమి మీద లభించే దైహిక, భౌతిక అధర (పెదవి) అమృతం– మోవి తేనె. గోపికలు కోరింది (న+ధరా) ధరామృతం కానిది. అధరామృతం. అనగా భూ సంబంధం లేని అమృతం. భగవత్ కథామృతం, ప్రేమామృతం, జ్ఞానామృతం, భక్త్యమృతం, దివ్య అద్వైతామృతం!

భగవానుడు... నా వియోగంలో మీరు బ్రతికే ఉన్నారు. మీ ప్రేమ నిష్కపట– నిజమైనదైతే, రామ వియోగంలో దశరథుని వలె మీరు ప్రాణాలు విడిచి ఉండేవారు కదా! గోపికలు... మా ప్రాణాలు నీ వద్ద ఉంటే మాకు మరణం ఎలా సంభవిస్తుంది అశరణ శరణా? కృష్ణా! నీ విరహాన మాకు ప్రాణహాని కలిగేదే. కాని, నీ కథామృత పానం చేయించే పుణ్యాత్ములచే ఆ మరణం రాకుండా ప్రతారణం– పెద్ద మోసం జరిగిపోయింది. నీ కథామృతం గ్రోలు వారు అపమృత్యువు పాలుగారు. ఆ ప్రలోభం వల్లనే మా ప్రాణాలు ఇంతవరకు పోకుండా ఆగినాయి. స్వర్గంలోని అమృతం అమరులకు, కర్మిష్ఠులకు మాత్రమే లభించేది. అది పుణ్యాన్ని క్షీణింపజేస్తుందే కాని పాపక్షయకరం కాదు. స్వర్గామృతం తాగినా ఎప్పటికైనా మరణం అనివార్యం. కాని, నీ కథామృతం అఘ– పాప నాశకమూ, అపవర్గ– మోక్ష ప్రదం కూడా! సనకాది జీవన్ముక్త మహాపురుషులు సైతం భగవత్ కథలంటే చెవి కోసుకుంటారు. అశన (అన్న) దానం, వసన (వస్త్ర) దానం కన్నా కథామృత దానం మిన్న. కృష్ణా! స్వర్గామృతం తాగాలి. కైవల్యామృతం అనుభవించాలి. కాని, ఇదో 'విసన్ శుభదం'– శ్రవణ మాత్రాన శుభాలనిచ్చేది. నిరంతర తపముచే తపిస్తున్న పురుష పుంగవులకు హృదంతరం– మానసంలో సంజీవనమై ఒప్పునట్టిది. నీ కథ విన్నవారి జీవనాలు– బ్రతుకులు ఆరిపోతాయి. కాలే పెనం మీద నీటి చుక్కలలాగా అవి ఆవిరైపోతాయి. తెల్లవారిపోతాయి– 'తమసోమా జ్యోతిర్గమయ'.

**ఆ॥ 'భక్తకామదంబు బ్రహ్మసేవిత మిలా
మండనంబు దుఃఖమర్దనంబు
భద్రకరమునైన భవదంఘ్రి యుగము మా
యురములందు రమణ! యునుప దగదె?'**

ప్రియతమా! భక్తుల అభీష్టాలను తీర్చేది, బ్రహ్మచే పూజింపబడేది, భూమికి భూషణమైనది, దుఃఖాలను భంజించేది, శుభాలను అనుగ్రహించి ఆదుకొనేది అయిన నీ పాదయుగాన్ని మా రొమ్ములపై ఉంచి మా కమ్మవిల్తుని– మన్మథుని వ్యథను బాపరాదా? (సశేషం)



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

గోదాగీత గోవిందం

నిత్యం విశ్వామిత్ర కృత సుప్రభాతంతో నిద్రలేచే తిరుమల వెంకన్న నేటి నుంచి గోదాదేవి పిలుపుతో మేల్కొంటాడు. ధనుర్మాస వేళ గోదాదేవి రాసిన తిరుప్పావు పాశురాలు రోజుకొకటి చొప్పున వింటాడు శ్రీనివాసుడు. అలాగే రోజులో ఒకసారి 30 పాశురాలూ ఆలకిస్తాడు. గోదాగీత గోవిందాన్ని వింటూ గోవిందుడు పరవశిస్తాడు. తిరుమల క్షేత్రంలో మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా ఉన్న వైష్ణవాలయాలలో ఈ ధనుర్మాసంలో తిరుప్పావై మార్మోగుతుంది. సంక్రాంతి వరకు కొనసాగే ఈ సిరినోము ధనుర్మాస వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది.

శ్రీరంగనాథుణ్ని కొలుస్తూ ధనుర్మాసంలో గోదాదేవి రోజుకొకటి చొప్పున ముప్పయ్ పాశురాలు ప్రస్తుతించింది. వీటిలో మొదటి ఐదు ఉపోద్ఘాతం లాంటివి. తిరుప్పావై ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. భగవంతుడికి చేసే అర్చన, నివేదన సహా అన్ని ఉపచారాల్లో ఆడంబరాలు అవసరం లేదని, చిత్తశుద్ధి ఉంటే భగవంతుడు సంతోషిస్తాడని ఈ పాశురాల్లో చెబుతుంది. తర్వాతి పది పాశురాల్లో చెలులతో కలసి, శ్రీరంగనాథుడిని సేవించటానికి గోదాదేవి వెళ్తున్న సన్నివేశాల వివరాలు వర్ణితమై ఉన్నాయి. పక్షుల కిలకిలారావాలు, అప్పుడే వికసిస్తున్న పూలు, దేవాలయంలో వినిపించే చిరుగంటల ధ్వనులు, లేగదూడల 'అంబా'రావాలు, వాటి మెడలో గంటల సవ్వడి మొదలైన మనోహర ప్రకృతి దృశ్యాల వైభవం వీటిలో కనిపిస్తుంది.

పదిహేను నుంచి ఇరవయ్యో పాశురం వరకు గోదాదేవి, చెలులతో కలిసి చేసిన దేవాలయ సందర్శన విశేషాలతో నిండి ఉంటాయి. 'కపట నిద్ర విడిచి, లోకాల్ని కాపాడటానికి మేలుకోవయ్యా' అంటూ రంగనాథుడికి సుప్రభాతం ఈ పాశురాల్లోనే వినిపిస్తుంది. కృష్ణుడి అష్టమహిషుల్లో ఒకరైన నీలాదేవి ప్రార్థన కూడా వీటిలోనే ఉంటుంది. తర్వాతి తొమ్మిది పాశురాలు పూర్తిగా భగవద్విలాసాన్ని ప్రకటిస్తాయి. నిష్కల్మష హృదయంతో తన హృదయాన్ని రంగనాథుడికి అర్పించుకుంటుంది గోదాదేవి. చివరి పాశురం ఫలశ్రుతి. ఎవరైతే ఈ పాశురాలు గానం చేస్తారో, వారికి భగవత్ కృప తప్పకుండా కలుగుతుందని అందులో హామీ ఇస్తుంది.

ఈ పాశురాలు గోదాగీతగా ప్రాచుర్యం పొందాయి. ఆధ్యాత్మిక ప్రస్థానంలో, మానవ జీవనంలో ఏది మంచో ఏది చెడో వివేచన చేసుకోమని హెచ్చరిస్తాయి ఇవి. మహర్షులైన వారి మార్గదర్శనం తీసుకోమని సూచించాయి. తిరుప్పావై పాశురాలు ఆత్మను పరమాత్మ సన్నిధికి చేర్చే వాహకాలు. సగుణోపాసన ద్వారా నిర్గుణోపాసనకు మార్గం చూపే దారి దీపాలు. అంతిమంగా 'శ్రీకైవల్యపదానికి' చేరవేసే పరమపద సోపానాలు.

...✍ శ్రీ భారతి

ధర్మసందేహం

సంక్రాంతి నిలబెట్టడం అంటే..

ధనుర్మాసంలో సంక్రాంతి నిలబెట్టడం అంటే ఏమిటి? ఈ సమయంలో శుభకార్యాలు ఎందుకు చేయరు?

- విజయ, కామారెడ్డి

సూర్యుడు ప్రతి నెలా ఒక్కో రాశిలో సంచరిస్తూ ఉంటాడు. సౌరమానం ప్రకారం సూర్యుడు ఉండే రాశిని బట్టి ఆ నెలకు పేరు పెట్టారు. భానుడు ధనుస్సు రాశిలో ఉన్న కాలాన్ని ధనుర్మాసం అని పిలుస్తారు. ధనుర్మాసం సంక్రాంతికి నెలరోజుల ముందు మొదలవుతుంది. దక్షిణాయనంలో ధనుర్మాసం చివరిది. ఈ కాలంలో సూర్యుడి ప్రభావం భూమిపై చాలా తక్కువగా ఉంటుంది. చలి తీవ్రత అధికం అవుతుంది. ఆరోగ్యకారకమైన సూర్యరశ్మి పరిమితంగా లభించే సమయం ఇది. ఫలితంగా అనారోగ్యాలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ధనుర్మాసం నుంచి మకర సంక్రాంతి (సూర్యుడు మకరంలోకి సంక్రమించే పర్వం) వరకు చలితీవ్రత అధికంగా ఉండటం వల్ల ఈ సమయంలో జాగ్రత్తగా ఉండాలని మన పెద్దలు హెచ్చరించారు. దీన్నే సంక్రాంతి నిలబెట్టడంగా పేర్కొన్నారు. అంతేకాదు ధనుర్మాసంతో చాంద్రమానం అంతర్గతంగా వచ్చే పుష్యమాసం ముడిపడి ఉంటుంది. పుష్యమి నక్షత్రానికి అధిపతి శనైశ్చరుడు కావడంతో ఈ నెలను శూన్యమాసంగా పరిగణిస్తారు. ఇలా శని ప్రభావం అధికంగా ఉండటం, సంక్రాంతిని నిలబెట్టిన నెల రోజులను పీడ దినాలుగా భావించడంతో ఈ సమయంలో శుభకార్యాలు చేయరు. ఇక శనైశ్చరుడి అనుగ్రహం కోరుతూ ఈ నెలలో నువ్వులు దానం చేయాలని సూచించారు పెద్దలు. ఇలా దానం ఇవ్వమని చెప్పడంలోనూ గొప్ప ఆంతర్యం కనిపిస్తుంది. చలి అధికంగా ఉండే ఈ సమయంలో నువ్వులూ, బెల్లంతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఒంట్లో వేడి పుట్టి, చలి నుంచి రక్షణ కలుగుతుంది. నువ్వులు కొనలేని బీదసాదలకు వాటిని దానం ఇవ్వడం అంటే.. వారికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇచ్చినవాళ్లం అవుతాం! నువ్వులతోపాటు దుస్తులు దానం ఇవ్వడం కూడా చలి నుంచి వారికి రక్షణ కల్పించడానికే!!

...✍ వంశీధర్

నైపుణ్యమే యోగం

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్॥
(భగవద్గీత 2-50)**

'కౌశలం' అంటే పనిలో నిబద్ధతతో కూడిన నేర్పు లేదా నైపుణ్యం. దానినే యోగం అంటుంది గీత. ప్రక్రియ ఆధారంగా చేసే పనిలో ఫలితం ఏదైనా సమానంగా తీసుకోవడమే సమత్వం. ఒక దొంగలో నైపుణ్యం ఉన్నా అది ఆదరణీయమా అంటే.. కాదనే చెప్పాల్సివస్తుంది. నైతిక విలువలు లేని నైపుణ్యాలను గీత ఆదరించదు. సరైన పనిని, సరైన విధానంలో నిర్వహించాలి. దానికి సరైన కారణం ఉండాలి. దానినే కౌశలం అంటారు.

భగవద్గీత బద్ధకస్తుడైన సాధారణ వ్యక్తిని, అసాధారణ కార్యసాధనా దక్షునిగా తీర్చిదిద్దేందుకు ఉపకరిస్తుంది. బుద్ధిని ఉపయోగించి, నైపుణ్యంతో పనిచేసే వ్యక్తి అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగిస్తూ.. అసాధారణ ఫలితాలను సాధిస్తాడు. కురుక్షేత్ర యుద్ధారంభంలో శ్రీకృష్ణుడి సాయం అపేక్షించి వెళ్లిన దుర్యోధనుడు సైన్యాన్ని కోరుకోగా, అర్జునుడు వాసుదేవుణ్ని కోరుకున్నాడు. గద్ద తానెంత ఎత్తులో ఉన్నా కింద ఉన్న లక్ష్యంపై దృష్టి చెదరనీయదు. అర్జునుడి వివేచన కృష్ణుడి జ్ఞానాన్ని, వివేచనను కోరుకోగా. దుర్యోధనుడి ఫలితాపేక్ష సంఖ్యాబలానికి మొగ్గుచూపింది.

శత్రువులను జయించి రాజ్యాన్ని పొందాలనే ఫలితాపేక్షతో యుద్ధానికి వచ్చిన అర్జునుడు, 'నా వాళ్లు' అనే మమకారంతో స్వధర్మాన్ని విడిచిపెట్టాడు. కృష్ణుడి ద్వారా భగవద్గీత విన్న తరువాత, అదే అర్జునుడు... యుద్ధాన్ని కర్తవ్యంగా భావించాడు. అర్జునుడి దృక్పథం మారింది. ధర్మ రక్షణే ప్రధానమని భావించాడు. తన కర్తవ్యాన్ని మమకారాది బంధనాలకు అతీతంగా నిర్వహించడం వల్ల అతని సామర్థ్యం ఇనుమడించింది. దీక్షతో, దక్షతతో మరింత ఉత్సాహంతో పోరాడాడు. దానినే ఫలితాపేక్షలేని నైపుణ్యంగా చెప్పవచ్చు.

...✍ పాలకుర్తి రామమూర్తి

ప్రదోషకాలం

ప్రదోషకాలం అత్యంత పవిత్రమైనది. ఇది నెలకు రెండుసార్లు వస్తుంది. శుక్ల, కృష్ణ పక్షాలలో వచ్చే త్రయోదశి నాడు సూర్యాస్తమయం తర్వాత 2 గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోషకాలం అని చెబుతారు. సూర్యాస్తమయం తర్వాత మూడు గడియలు (గంటా పన్నెండు నిమిషాలు) ప్రదోషకాలమని కొందరు చెబుతారు. ప్రదోషకాలం అంటే రాత్రికి ఆరంభ సమయంగా పరిగణిస్తారు. దీనిని పాపనిర్మూలన కాలంగా భావిస్తారు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనందతాండవం చేస్తాడని ప్రతీతి. ఈ సమయంలో ఇష్టదైవానికి సంబంధించి స్తోత్రాలు పఠించడం గానీ, భజనలు గానీ చేస్తే మంచిదని పెద్దల మాట. ప్రదోషకాలంలో శివలింగాన్ని ఆవుపాలతో అభిషేకిస్తే దీర్ఘాయుష్షు కలుగుతుందనీ, నెయ్యితో అభిషేకిస్తే మోక్షం లభిస్తుందనీ, గంధంతో అభిషేకం చేస్తే లక్ష్మీకటాక్షం ప్రాప్తిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

మీది ఏ రకమైన మనసు?

ఇస్లాం బోధ

మనసును ఖురాన్ పరిభాషలో 'నఫ్స్' అంటారు. మూడు రకాల మనసులు ఉంటాయని ఖురాన్ పేర్కొన్నది. అవి నఫ్సె అమ్మారా, నఫ్సె లవ్వామా, నఫ్సుల్ ముత్మయిన్నహ్.
మనసుల్లో మంచివి ఉంటాయి, చెడ్డవి ఉంటాయి. మనసులో క్రోధం, అసూయ, ద్వేషం, ప్రేమ అన్నీ ఉంటాయి.
నఫ్సె అమ్మారా అంటే.. 'మనసు చెడుకై ప్రేరేపిస్తూనే ఉంటుంది' (12:53)
ఇలాంటి మనసు మనపై ఆధిపత్యం చెలాయిస్తుంది. మనల్ని చెడుకు పురిగొల్పుతుంది. ఇలాంటి మనసున్నవారు కోరికలకు బానిసవుతారు. మనసు చెప్పిందల్లా చేస్తారు. ఎలాంటి పశ్చాత్తాప భావన లేకుండా పాపాలకు ఒడిగడుతుంటారు. ఇలాంటి మనసును ఖురాన్ నఫ్సె అమ్మారాగా అభివర్ణించింది ఖురాన్.
నఫ్సె లవ్వామా.. 'నేను ప్రబోధించే అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను' (75:2)
లవ్వామా.. అంటే ఏదైనా తన వల్ల తప్పిదం జరిగిపోతే తనను తాను నిందించుకోవడం. అపరాధ భావంతో కుంగిపోయి పశ్చాత్తాపం చెందడం అని అర్థం. ఇలాంటి మనసున్న వాళ్లు తమ వల్ల జరిగిన తప్పిదాలకు పశ్చాత్తాపం చెందుతారు. పాప కార్యాల నుంచి వైదొలుగుతారు. నిత్యం ఇలాంటి వాళ్లు మనసుతో యుద్ధం చేస్తుంటారు. ఒక్కోసారి మనసు ఆధిపత్యం చెలాయిస్తే మరోసారి మనసుకు కళ్లెం వేస్తారు.
నఫ్సుల్ ముత్మయిన్నహ్.. 'తృప్తిచెందిన మనసా! నీ ప్రభువు సన్నిధికి పదా! నీ ప్రభువుకు ఇష్టమైన దానివై.. నా దాసులలో (పుణ్యాత్ములైన) చేరిపో, నా స్వర్గంలో ప్రవేశించు' (89:27-28)
నఫ్సుల్ ముత్మయిన్నహ్.. అంటే తృప్తి చెందిన మనసు అని అర్థం.
ఇలాంటి మనసు గలవారు తమ మనసుకు తగిన శిక్షణ అందించి, తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటారు. అల్లాహ్ అభీష్టానికి అనుగుణంగా నడుచుకుంటారు. ఇలాంటి మనసు ఎప్పుడూ మంచినే కోరుకుంటుంది. అశాంతికి తావుండదు. ఎలాంటి చెడు భావాలను దరిచేరనివ్వదు. ఎందుకంటే మనసును ఆ విధంగా శిక్షణనిచ్చాడు కాబట్టి చెడులను స్వీకరించడం మానేస్తుంది. ఇలాంటి మనసున్న వారిపట్ల అల్లాహ్ ప్రసన్నుడు అవుతాడు. వారిని స్వర్గానికి సాదరంగా ఆహ్వానిస్తాడు.



..✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076